క్లుప్తంగా

నేడు ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు చేసి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. షుగర్ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568 286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు కల్యాణ మహోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని యరమలపల్లెలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మిచెన్నకేశవ స్వామి కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆలయంలోని మూలమూర్తులతో పాటు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని 9.30 కల్యాణ మహోత్సవం, 12కు అన్న ప్రసాద వితరణ, 4కు గ్రామోత్సవం జరుగుతుందని ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

నేటి నుంచి లక్ష్మినరసింహ స్వామి ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు.


నివాళి



నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు లేబాక రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ఉదయం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి వారి నివాసానికి చేసుకుని నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మతల్లి వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో మారెమ్మతల్లి అమ్మవారు

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను గ్రామ సమీపంలో వెలసిన మారెమ్మతల్లి పదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం నిర్వహించిన కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కడప రాయుని కోనేటి విహారం

కడప కల్చరల్ : మండుతున్న ఎండలతో ఉక్కపోత. సాయంత్రం చల్లగాలికి సేద తీరాలనిపించే వాతావరణంలో కడప రాయుడు లక్ష్మీ, వేంకటేశ్వరుడు తెప్పపై శ్రీకృష్ణ, దేవేరి ఆండాళ్ తాయారు (గోదాదేవి)తో కలిసి విహరించారు. దేవునికడప ఆలయంలో తెప్పోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజున సాయంత్రం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం చేసి పల్లకిలో కొలువుదీర్చారు. అర్చకులు కృష్ణ మోహన్, మయూరం తివిక్రమ్ బృందం వేదమంత్రోచ్చాటన మధ్య తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పుష్కరిణిలోని తెప్పలో కొలువుదీర్చారు. పూజల అనంతరం మంగళహారతి ఇచ్చి తెప్ప పుష్కరిణిలో తొలి ప్రదక్షిణ చేయించారు. రెండోమారు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు గాయకులు భక్తిగీతాలాపనతో తెప్పతో ప్రదక్షిణ నిర్వహించారు. మూడోమారు స్వామి, అమ్మవారు మంగళ వాయిద్యాల మధ్య ప్రదక్షణ చేశారు. మంగళహారతులు అనంతరం స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

వీర జవాన్ మురళి నాయక్‌కు ఘన నివాళి



పులివెందులలో జవాన్ మురళీ నాయక్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పాకిస్తాన్‌తో జరుగుతున్న ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణాలర్పించి అమరుడైన మన తెలుగు జాతి ముద్దుబిడ్డ వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మురళి నాయక్ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మురళినాయక్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సమయంలో ప్రతి ఒక్కరం భారత సైన్యానికి మద్దతుగా నిలవాలని, ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కిశోర్, వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రమౌళి, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబకపల్లె నారాయణస్వామి, విద్యార్థి సంఘం నాయకులు జశ్వంత్‌రెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, ఖాదర్, మల్లి, పురుషోత్తం, గండి రాము, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్ యుద్ధ భూమిలో పోరాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మురళినాయక్ వీర మరణం పొందడం బాధాకరం అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, రైతు జిల్లా కన్వీనర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వీర మరణం పొంది జవాన్ మురళినాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మైసూరారెడ్డి, మర్రి సుబ్బన్న, జెట్టి నగేష్, సునీల్‌రెడ్డి, శ్రీరాం రమణ, దాసరి సురేష్, చంద్రపాల్, చంటి తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : కాశ్మీర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు ఘన నివాళులు అర్పించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మురళీనాయక్ చిత్రపటానికి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సత్యసాయి జిల్లా వాసి పెనుగొండ నియోజకవర్గానికి చెందిన మురళీనాయక్ దేశం కోసం ప్రాణాలు అర్పించారన్నారు. ఆయన కుటుంబానికి ప్రజలందరూ అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కొమెర్ల మోహన్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గుజ్జల లక్షుమయ్య, మైలవరం మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ విభాగం జాయింట్ సెక్రటరీ ముల్లా జానీ, రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమలాపురంలో మురళి నాయక్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జమ్మలమడుగులో మురళీనాయక్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

ముద్దనూరులో

ముద్దనూరు : పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో దేశం కోసం పోరాడుతూ అమరుడైన వీరజవాన్ మురళినాయక్‌కు శనివారం ఘన నివాళులర్పించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అమరవీరుడు మురళినాయక్ చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ శ్రేణులు ఘనంగా నివాళిలర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళినాయక్ త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరచిపోదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలి

వేంపల్లె : పాకిస్తానీలు మనదేశంలో పహాల్గాంలో చేసిన ఉగ్రదాడికి ప్రతిచర్యగా భారత ప్ర భుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధుర్ విజయవంతం కావాలని స్థానిక బీజేపీ నాయకులు, వి శ్రాంత అర్మీ ఉద్యోగులు వేంపల్లె ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ జిల్లా ప్రధాన కా ర్యదర్శి గాలిహరి ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచానికి పెను ముప్పుగా మారిన ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కవ్వింపు చర్యల కారణంగా పహాల్గాంలో మన వారు చనిపోయారన్నారు. దానికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై దాడి చేసి వంద మంది ఉగ్రవాదులను చంపడం జరిగిందన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆర్టి కల్ 370 రద్దుచేసిన సందర్భంలో మన దేశ అభివృద్ధిని చూసి ఓర్వలేక పాకిస్తాన్ ఉగ్రదాడులకు పాల్పడిందన్నారు. పాకిస్తాన్ మనదేశ పౌరులను చంపినా మనదేశ సైనికులు ఆ దేశంలోని సామాన్య ప్రజలను చంపకుండా కేవలం ఉగ్రవాదులను మాత్రమే మట్టు బెట్టారన్నారు. సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ మృతి బాధాకరమన్నారు.

దర్గాలో ఉరుసు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం అల్మాస్‌పేట సర్కిల్‌లోని గేసుదరాజ్ బందనవాజ్ దర్గాలో కొలువైన హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమినుద్దీన్ హుసేని ఖుదస సిర్రహు ఉరుసు మహోత్సవం సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మహ్మద్ హుసేనీ సాహెబ్ గంధాన్ని సమర్పించి ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు.

ఇంటర్ అడ్మిషన్ల కోసం ముమ్మర ప్రచారం



విద్యార్థినికి ఇంటర్ అడ్మిట్ కార్డును అందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల కోసం ప్రచారాన్ని ముమ్మరం చేసినట్లు హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం చెరుకూరు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా కళాశాలలో బైపీసీ, సీఈఓ గ్రూపులలో ప్రవేశానికై దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సెక్షన్లకు 20 మంది విద్యార్థులు చొప్పున రెండు గ్రూపులు కలిపి 40 మందికి సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటికే రెండు గ్రూపులో కలిపి 20 మంది విద్యార్థులకు అడ్మిట్ కార్డులు అందజేశామని, రాష్ట్ర వ్యాప్తంగా హైస్కూల్ ప్లస్‌లో చదివినటువంటి విద్యార్థినులు నీట్, జేఈఈ లాంటి వాటిలో సీట్లు కూడా సాధించారన్నారు. ఈ ఏడాది నుంచి విద్యార్థినులకు హాస్టల్ వసతి కూడా కల్పించే అవకాశం ఉందన్నారు. కేవలం రూ.2 వేల ఫీజుతో ఇంటర్ విద్యను హైస్కూల్ ప్లస్‌లో పూర్తి చేసుకోవచ్చని, ఇంకా ఉచితంగా టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, తల్లికి వందనం పేరుతో రూ.15వేలు ప్రతి ఏడాది ప్రభుత్వం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాపురస్వామి బ్రహోత్సవాలకు ఆంకురార్పణ



నారాపురస్వామి బ్రహోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

జమ్మలమడుగు : పట్టణంలోని శ్రీనారాపురస్వామి బ్రహోత్సవాలకు వేదపండితులు ఆంకురార్పణ చేశారు. శనివారం సాయంత్రం ఆంకురార్పణ పూజను తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, తులశమ్మలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పెద్దశేష వాహనంపై దేవదేవుడు సతీ సమేతంగా భక్తులకు దర్శనం ఇవ్వడంతోపాటు పురవీధులు గుండా ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించనున్నారు.15వ తేదీ ఆదివారం గరుడ వాహనం, 16వ తేదీ శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం 17వ తేదీ శనివారం రథోత్సవం, 20వ తేదీ పుష్పయాగంతో నారాపురస్వామి బ్రహోత్సవాలు ముగిస్తాయని వేదపండితులు తెలిపారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తాం

వేంపల్లె : స్థానిక పంచాయతీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో తలెత్తిన తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. శనివారం వేంపల్లెలోని సర్పంచ్ ఛాంబర్‌లో ఆయన వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు తమ పరిధిలోని వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ వేంపల్లె పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం వేసవి రీత్యా నెలకొన్న తాగునీటి సమస్యను డిస్ట్రిక్ మినరల్ ఫండ్(డీఎంఎఫ్) ద్వారా కొత్త బోర్లను ఏర్పాటు చేసి ఆ సమస్యను అధిగమిస్తామన్నారు. తాగునీటి బోర్లు ఎండిపోయి సమస్య తలెత్తిందని, వీటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది హరికృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

టాపర్స్‌కు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థినికి నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్న వైజీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు, హెడ్మాస్టర్లు

సింహాద్రిపురం : మండలంలోని జిల్లా పరిషత్, కస్తూర్బా గాంధీ విద్యాలయ పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు వైజీర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఆయా పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు మొదటి బహుమతి కింద రూ.4వేలు, రెండవ బహుమతి కింద రూ.3వేలు, మూడవ బహుమతి కింద రూ.2వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులను హెడ్మాస్టర్లు, వైజీఆర్ ట్రస్ట్ ప్రతినిధులు అందజేశారు. అలాగే ఇద్దరు ఇంటర్ విద్యార్థినులకు రూ.10వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ వై.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ విద్యా సేవలను మరింత విస్తృతపరిచి పేద విద్యార్థులకు మరింత చేయూతనందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

నేడు ఇంజనీరింగ్ విద్యపై అవగాహన సదస్సులు

చింతకొమ్మదిన్నె : రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఎన్జీవో హోం, మైదుకూరు పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ పక్కన ఉన్న శ్రీ లక్ష్మీచెన్నకేశవ ఫంక్షన్ హాలు, బద్వేల్ పట్టణం నెల్లూరు రోడ్డులోని నాగభూషణం మినీ ఫంక్షన్ హాలులో ఇంజనీరింగ్ విద్య పై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుదాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అవ గాహన సదస్సుకు ఇంజనీరింగ్ కోర్సులలో చేరుటకు ఆసక్తి గల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని ఇంజనీరింగ్ విద్యపై అవగాహన పొంది ఉత్తమమైన, మంచి నాణ్యత, ప్రమాణాలు కలిగిన కళాశాలను ఎంచుకోవడంలో తగు నిర్ణయం తీసుకొని మీ బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

అంధుల ఆశ్రమంలో అన్నదానం



అంధులకు అన్నదానం చేస్తున్న కృష్ణకుమార్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక అంధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాత్రికేయుడు గుంట కృష్ణ కుమార్ (కిట్టు) తండ్రి, విశ్రాంతి ఉపాధ్యాయుడు గుంట వెంకటసుబ్బయ్య నాల్గవ వర్ధంతి సందర్భంగా శనివారం అంధుల ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. తన తండ్రి కూడా సామాజిక సేవ చేసుకుంటూ ఉపాధ్యాయ వృత్తిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా అన్నదాన కార్యక్రమం చేయడం జరిగిందని ఆయన కుమారుడు కృష్ణకుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు గుంట విజయమ్మ, గుంట మధుసూదన్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

వేంపల్లె : స్థానిక గాండ్ల వీధిలో (ఆర్టీసీ బస్టాండ్ పక్కన) వెలసిన త్యాగరాజు నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆలయంలో అఖండ దీపారాధన, కలశ స్థాపన, మహాగణపతి పూజ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈనెల 11న ఆదివారం ప్రాతఃకాల పూజలు, విగ్రహ శుద్ధి, దీక్ష హోమాలు, విగ్రహాలు మేళ తాళాలతో పురవీధుల గుండా గ్రామోత్సవం, 12న విగ్రహ ప్రాణ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం జ్వాలా దర్శనం, గోదర్శనం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు ఉర్దూ షాదీఖానా కల్యాణం మండపంలో గొప్ప నాదస్వర కచేరి ఉంటుందని, ఈ కార్యక్రమానికి మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు శ్రీవరదరాజులస్వామి కల్యాణం

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామ సమీపంలో ఉన్న దేవర కోనలో ఈనెల 12వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరదరాజస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు వరదరాజస్వామి భక్త బృందం తెలిపారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం మొలకల ఎత్తు కార్యక్రమం, రాత్రి 8 గంటలకు కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు.

13న బండలాగుడు పోటీలు

వెలిదండ్ల గ్రామ సమీపంలోని దేవర కోన సమీపంలో ఈనెల 13వ తేదీన మంగళవారం న్యూ క్యాటగిరి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన మొదటి బహుమతి రూ.60వేలు, 2వ రూ.40వేలు, 3వ రూ.30వేలు, 4వ రూ.20వేలు, 5వ రూ.15వేలు, 6వ రూ.10వేలు, 7వ రూ.8వేలు ఉంటాయన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి కాడికి రూ.5వేల కన్సలేషన్ బహుమతి ఉంటుందన్నారు. అలాగే చెక్క భజన, గజ్జపూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



మంచినీటి బోరులో అదనపు పైపులను దింపుతున్న సిబ్బంది

వేంపల్లె : స్థానిక పంచాయతీ పరిధిలోని మదీనాపురంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతం వార్డు సభ్యుడు ఉమర్ సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ మదీనాపురంలోని మసీదు వద్ద ఉన్న బోరు నుంచి నీరు అడుగంటిపోవడంతో నీటి ఎద్దడి తలెత్తినట్లు సంబంధిత సిబ్బంది గుర్తించి, వెంటనే అదనపు పైపులను దింపి తాగునీరు వచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ చొరవ పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

18న లాసెట్ పై అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధి నందిని క్లాత్ మార్కెట్‌లోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో ఈ నెల 18న ఉదయం తొమ్మిది గంటలకు లాసెట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శివారెడ్డి, సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో లాసెట్ రాసే అభ్యర్థులకు నిపుణులు తగిన సూచనలు, సలహాలందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 944132 5909లో సంప్రదించాలని కోరారు.

ప్రారంభమైన హరిహరాదుల బ్రహ్మోత్సవాలు



పూజా కార్యక్రమాలు చేస్తున్న సత్య సాయినాథ్ శర్మ దంపతులు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీ వల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు కనుల పండువగా ప్రారంభం అయ్యాయి. పుణ్య భూమి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ఆలయ ప్రధాన సేవకుడు సత్య సాయి నాథశర్మ దంపతుల ఆధ్వర్యంలో శనివారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. మొదటి రోజు ఉదయం మహా గణపతిపూజ, పుణ్యాహవచనం, సంకల్ప అంకురార్పణ, ధ్వజా రోహణం, దీక్షా హోమం తదితర పూజాధికారాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మోక్ష నారాయణ స్వామిని హనుమద్వాహనంపై, సుబ్రమణ్య స్వామిని హంస వాహనంపై ఊరేగించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు విరివిగా హాజరై స్వామి వార్లను దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ప్రత్యే పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా శేష వాహన సేవ



వెయ్యినూతల కోనలో శేష వాహన సేవలో కొలువైన లక్ష్మినరసింహస్వామి

పెండ్లిమర్రి : వెయ్యినూతలకోన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా శేష వాహన సేవ నిర్వహించారు. ముందుగా ధ్వజారోహణము, కలశస్థాపన, అగ్నిప్రతిష్ట, శాంతి హోమం వంటి కార్యాక్రమాలు నిర్వహించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు నరసింహస్వామి జయంతి

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మినరసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, వేదపారాయనం, మహామంగళహారతి, సాయంత్రం హనుమత్ వాహనం వంటి కార్యాక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా పీఠాధిపతికి పట్టాభిషేకం



సయ్యద్‌షా తాహీర్ పీరాఖాద్రీని పీఠాధిపతిగా ప్రకటిస్తున్న సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ

జమ్మలమడుగు : ఆస్తానయే గౌసియా పీఠాధిపతిగా సయ్యద్ షా తాహీర్ పీరాఖాద్రీకి వైభవంగా పట్టాభిషేకం నిర్వహించారు. శనివారం రాత్రి ఆస్థానయే గౌసియా ప్రస్తుత పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వివిధ పీఠాధిపతుల సమక్షంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శిష్యులు వందల మంది వేడుకకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ మాట్లాడుతూ తనను ఇప్పటి వరకు ఎటువంటి గౌరవ మర్యాదలు ఇచ్చారో ఇకపై నాకు మారుడైన తాహీర్ పీరాఖాద్రీకి పీఠాధిపతిగా అదే ప్రాధన్యత ఇవ్వాలని శిష్యులకు సూచించారు. ఆదే విధంగా రెండో కుమారుడు సయ్యద్‌షా తాహీర్ అత్తహర్ ఖాద్రీకి ఖలిఫత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా ఉరుసు

తూగుట్లపల్లి జాగీర్దార్ సయ్యద్‌షాబడే గౌస్ పీరాఖాద్రీ 93వ ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ఉరుసు వేడుకలను నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి గంధోత్సవం పట్టణంలో ఊరేగింపుగా నిర్వహించారు. రాత్రి గొప్ప ఖవ్వాలి పోటీలు నిర్వహించారు.

మమల్ని రాజకీయంగా వాడుకోవద్దు



విలేకరులతో మాట్లాడుతున్న ఫాస్టర్ల సంఘం ప్రతినిధులు

పులివెందుల టౌన్ : మమ్మల్ని రాజకీయంగా వాడుకోవద్దని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాం నుంచే గౌరవ వేతనం వస్తోందని, ఎవరూ మేలు చేసినా కృతజ్ఞతలు తెలపడం మా ధర్మమని ఫాస్టర్ల సంఘం ప్రతినిధులు కృపరాజు, దావీదు, డేవిడ్ రాజులు తెలిపారు. శనివారం భాకరాపురంలోని వైఎస్ జయమ్మ కాలనీలో ఉన్న చర్చి ఆవరణలో వారు విలేకరుల సమావేశం మాట్లాడారు. వైఎస్సార్ కుటుంబం అంటే అభిమానం, గౌరవం ఉన్నాయని, పులివెందులలో నిలబడ్డామంటే దానికి కారణం వైఎస్ కుటుంబీకులే కారణమన్నారు. ఏ రోజు కూడా మమ్మల్ని రాజకీయ పార్టీ కొమ్ము కాసే పరిస్థితి రానివ్వలేదని, కానీ ఈ రోజు సహాయం చేసిన వారికి కృతజ్ఞతలు తెలపడం కోసం మమల్ని స్వామిదాస్ అనే వ్యక్తి ఒక చర్చిలో కలవడం జరిగిందన్నారు. దాని తరువాత పార్టీ పెద్దలకు తెలిపితే బాగుంటుందని, అక్కడ నుంచి టీడీపీ ఆఫీస్‌కు తీసుకెళ్లి అక్కడ మా ఫొటోలు తీసి సోషల్ మీడియా వేదికగా ఒక పార్టీకి ఆపాదించడం వలన చాలా దిగ్భ్రాంతి కలిగిందన్నారు. దయచేసి మమల్ని రాజకీయాలకు వాడుకోకుండా, మీ నాయకుల మెప్పు పొందడం కోసం ఈ లాంటి కార్యక్రమాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

శిలాఫలకాలు శిథిలం

కడప కార్పొరేషన్ : రాజీవ్ పార్కులో శిలా ఫలకాలు శిథిలమయ్యాయి. కడప నగరంలో సుమారు రూ.110 కోట్లతో 2023 జూలై, 10న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజీవ్ పార్కు వద్ద వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. వాటిలో చాలా పనులు పూర్తవగా, కొన్ని మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అభివృద్ధి పనులు జరిగిన చోట శిలాఫలకాలు ఏర్పాటుచేయాల్సిన అధికారులు ఇలా...రాజీవ్ పార్కులో వదిలేసి వెళ్లారు. కొన్ని మట్టిపాలవగా.. మరిన్ని పగిలిపోయే స్థితిలో ఉన్నాయి. పుట్లంపల్లె లేక్ రెజువనేషన్ పనులకు సంబంధించి రూ.15 కోట్లు, సీవరేజ్ అండ్ సెప్టిక్ మేనేజ్‌మెంట్ కోసం రూ.50.22 కోట్లు, నగర పాలక సంస్థ నూతన కార్యాలయ భవనానికి రూ.31.17కోట్లు, రాజీవ్‌పార్కు రోడ్డు రూ.5.61కోట్లు, రాజీవ్ పార్కు రూ.1.37కోట్లు గత ప్రభుత్వం కేటాయించింది. ఇందులో పుట్లంపల్లె లేక్, సీవరేజ్ అండ్ సెప్టిక్ మేనేజ్‌మెంట్(అమృత్ 2.0) పనులు పూర్తయ్యాయి.